క్లుప్తంగా

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

డెంకాడ: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో ఎస్.జీవనరాణి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె శనివారం సందర్శించారు. ఆస్పత్రి పరిసరాలు సహా రికార్డులు, మందుల నిల్వలు, సిబ్బంది పనితీరు, రోగులకు అందిస్తున్న వైద్యసేవలు పరిశీలించి, పలు సూచనలు చేశారు. సిబ్బంది సమయానికి విధులకు హాజరై, సకాలంలో రోగులకు వైద్యం అందేలా చూడాలని తెలిపారు. అనంతరం జాతీయ ఆరోగ్య కార్యక్రమంపై ఆరాతీశారు. కార్యక్రమంలో వైద్యురాలు అనూష, సీహెచ్‌వో రాజు, యూడీసీ దుర్గారావు, ఫార్మాసిస్ట్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పలు ప్రాంతాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ డీఈఈ త్రినాధరావు ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, వల్లూరు, బుచ్చన్నపేట, బొద్దపేట, ఒమ్మి, మల్యాడ, వెంకన్నపాలెం, పూతికపేట, కొండగుంపాం, గరికిపేట, మొయిద, కొండవెలగాడ, పారసాం గ్రామాలకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

సన్మానం

విజయనగరం టౌన్: ప్రపంచ సంగీత దినోత్సవం పురస్కరించుకుని, కొత్తఅగ్రహారంలోని రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.భీష్మారావును శనివారం సన్మానించారు. ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్, రోటరీ దళగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చార్టెడ్ అకౌంటెంట్ సోమయాజులు హాజరై, కాసేపు మాట్లాడారు. సంగీత రంగంలో రాణిస్తున్న భీష్మారావు వంటి గొప్ప వ్యక్తులను సత్కరించుకోవడం చాలా ఆనందదాయకమన్నారు. అనంతరం చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అకాడమీ కార్యదర్శి మండపాక రవి, కేపీ పద్మప్రియా తదితరులు పాల్గొన్నారు.

జంట గ్రామాల్లో 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'

వేపాడ: మండల కేంద్రమైన వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్‌డీ రవికుమార్ నేతృత్వంలో ర్యాలీ నిర్వహించి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వేపాడ చెత్త సంపద కేంద్రం వద్ద పరిసరాలను పరిశుభ్రం చేశారు. తడి, పొడి చెత్త వేరుచేయుట.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు.. నీటి పొదుపై వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఆయుష్ వైద్యులు, స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్ పర్సన్ రాంబాబు, తదితదరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా నువ్వు సాగు

కొత్తవలస: నియోజకవర్గ పరిధిలో సాగు చేస్తున్న నువ్వు పంట ఆశాజనకంగా ఉంది. లక్కవరపుకోట, వేపాడ, జామి, కొత్తవలస, శృంగవరపుకోట, జామి మండలాల్లో సుమారు 10 వేల ఎకరాల్లో నువ్వు సాగు చేస్తున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న పంట ఏపుగా పెరిగి పూత దశకు చేరుకుంది. మరికొద్ది రోజులు వాతావరణం సహకరిస్తే అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా ఖరీఫ్ పనులు



రైతుసేవ కేంద్రంలో ఉన్న వరి విత్తనాలు

లక్కవరపుకోట: ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు ఖరీఫ్ పనుల్లో బిజీగా ఉన్నారు. వ్యవసాయ పనులు ప్రారంభమైనా ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకపోవడంతో రైతులు అప్పులు చేసి మరీ సాగుకు సిద్ధమయ్యారు. ముఖ్యంగా రేగ, కళ్లేపల్లి, లచ్చంపేట, తదితర గ్రామాల్లో రైతులు వరి నారుమడులు తయారీలో తలమునకలయ్యారు. కొన్ని సచివాలయాల పరిధిలో రాయితీ విత్తనాలు అందజేయకపోవవడంతో రైతులు ప్రైవేట్ డీలర్స్ వద్ద విత్తనాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో ఈ పాటికే విత్తనాలు, ఎరువులు అందజేయడంతో పాటు రైతుభరోసా కింద పెట్టుబడి సాయం కూడా అందించారు.

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం!

- మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ
- పచ్చదనంతో శుభ్రమైన గాలి, ఆహ్లాదకర వాతావరణం
- ఉద్యమంలా మొక్కల పెంపకం కొనసాగాలి



గర్భాం నర్సరీలో పంపిణీకి సిద్ధంగా మొక్కలు(ఫైల్)

విజయనగరం గంటస్తంభం: వృక్షో రక్షతి రక్షితః అన్నారు పెద్దలు. చెట్లను మనం రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయన్నది దీని సారాంశం. అయితే రాను రాను అడవుల శాతం తగ్గుతుండడం, ఎక్కడా అంతగా మొక్కల పెంపకం కనిపించకపోవడం కొంతవరకు ఆందోళన కలిగిస్తోంది. మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్న విషయం అందరూ గుర్తెరగాలి, మొక్కలు పెంచడాన్ని బాధ్యగా భావించాలి. అలాంటప్పుడే సామాజిక అడవుల పెంపకం జరిగి తద్వారా పచ్చదనం ఏర్పడుతుంది. దీంతో ఆహ్లాదకర వాతావరణం, పరిశుభ్రమైన గాలి లభిస్తాయి. ఈ నేపథ్యంలో మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దామని అటవీశాఖ అధికారులు, పర్యావరణ వేత్తలు పిలుపునిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న వనమహోత్సవానికి ఊతమిచ్చేలా మొక్కలు నాటుతూ దీన్నొక ఉద్యమంలా ముందుకుతీసుకెళ్లాలి.

మొక్కలు.. ఉచితం..

మీరు పర్యావరణ పరిరక్షకులా.. మొక్కలు పెంచేందుకు ఆసక్తి ఉందా.. పొలాలతో పాటు నచ్చిన చోట మొక్కలు నాటేందుకు అటవీ శాఖ అవకాశం కల్పిస్తోంది. ఈ మేరకు లక్షల మొక్కలు సిద్ధం చేసింది. సంబంధిత అధికారులను సంప్రదించి, వివరాలు తెలియజేస్తే ఉచితంగా అందిస్తారు. ఇప్పటికే నర్సరీల నుంచి తరలిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

21 లక్షల మొక్కలు సిద్ధం..

ఇప్పటికే వర్షాకాలం ప్రారంభం కాగా ఈ సమయమే మొక్కలు నాటేందుకు అనువైనది. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 33 నర్సరీలను అటవీ శాఖ సిద్ధం చేసింది. అందులో లక్షలాది మొక్కలను పెంచుతోంది. వీటిల్లో 20 లక్షలకు పైగా ఉచితంగా పంపిణీ చేయనుంది. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలకు ఇచ్చేందుకు, రహదారులకు ఇరువైపులా నాటేందుకు చర్యలు తీసుకోనుంది. అవసరమైన రైతులకూ సరఫరా చేయనుంది. మరో లక్ష మేర 17,306 హెక్టార్లలో విస్తరించి ఉన్న అటవీ భూముల్లో వేయనుంది.

కనీస ధరకు..

ఉపాధి హామీ పథకం నిధులతో నర్సరీలు అభివృద్ధి చేశారు. అక్కడి నుంచి రైతులు, ప్రభుత్వ శాఖలకు ఉచితంగా మొక్కలు తరలిస్తున్నారు. పరిశ్రమలు, ఇతర ప్రైవేటు సంస్థలకు కలెక్టర్ నిర్ణయించిన కనీస ధరలకు ఇవ్వనున్నారు. అన్నదాతలకు అయితే 3 వేల వరకు ఇస్తారు. ప్రస్తుతం మర్రి, రావి, వేప, అశోక, మారేడు, బాదం, కానుగ, చింత, దానిమ్మ, తెల్ల మద్ది, రేలా, ఉసిరి, పనస, సరుగుడు, నీలగిరి, టేకు, నేరేడు, యెగిస, ఎర్రచందనం మొక్కలు ఇస్తున్నారు.

ఎలా తీసుకోవాలి..

సమీపంలోని నర్సరీలకు వెళ్లాలి. ఆధార్ కార్డు, మొబైల్ నెంబరు, తెల్లరేషన్ కార్డు, 1-బి తప్పనిసరిగా అందించాలి. అక్కడ దొరికే దరఖాస్తు నింపి, వెంట తీసుకువెళ్లినా పత్రాలు జతచేసి, నిర్వాహకులకు అందిస్తే మొక్కలు ఇస్తారు. రవాణా సదుపాయం మాత్రం రైతులే చూసుకోవాలి.

మండలాల వారీగా ఇలా..		
మండలం	నర్సరీలు	మొక్కలు(లక్షల్లో)
గుర్ల	1	0.45
గరివిడి	3	2.03
మెరకముడిదాం	2	1.35
చీపురుపల్లి	4	1.65
భోగాపురం	1	0.45
పూసపాటిరేగ	4	2.40
కొత్తవలస	4	2.13
గంట్యాడ	2	1.70
ఎస్.కోట	2	1.00
గజపతినగరం	2	1.45
బొండపల్లి	2	1.25
బొబ్బిలి	2	1.60
తెర్లాం	2	1.15
దత్తిరాజేరు	1	0.87
రాజాం	1	0.75



పొలాల్లో నాటేందుకు ట్రాక్టరులో లోడ్ చేస్తున్న మొక్కలు(ఫైల్)

మొక్కల సరఫరా ఇలా..

- టేకు, కొబ్బరి, జీడి, మామిడి తదితర మొక్కలను రైతులకు ఉచితంగా ఇస్తారు.
- ఎన్ఆర్ఈజీఎస్ కింద పెంచబడిన పొడవైన మొక్కలను పీడీ, డీడబ్ల్యూఎంఎ, డీఆర్‌డీఏ, ఇతర ప్రభుత్వ విభాగాలకు సరఫరా చేస్తారు.
- సీఏఎంపీఏ పథకం కింద పెంచిన మొక్కలను ప్రభుత్వ విభాగాలు, పరిశ్రమలు, ప్రైవేట్ సంస్థలకు ఖర్చు ప్రాతిపదికన అందిస్తారు.

5 లక్షలు అందించాం..



ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 5 లక్షల వరకు మొక్కలను ఉచితంగా అందించాం. రైతులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల వారు ఎక్కువగా తీసుకెళ్తున్నారు. ఇంకా ఎవరికైనా కావాలంటే మా అటవీ శాఖ సిబ్బందిని సంప్రదించవచ్చు.

– ఆర్.కొండలరావు, జిల్లా అటవీశాఖ అధికారి

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయండి



మాజీ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

డెంకాడ: వైఎస్సార్ సీపీ మరింత బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు సూచించారు. మండలంలోని మోపాడ గ్రామంలో ఇటీవల నియమితులైన పార్టీ వివిధ అనుబంధ విభాగాల నాయకులంతా మాజీ ఎమ్మెల్యేను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి ఆ పదవులు రావడంలో కృషి చేసినందుకు గాను ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే అప్పలనాయుడు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని, రెట్టింపు ఉత్సాహంతో పార్టీ అభివృద్ధి కోసం పనిచేయాలని తెలిపారు. అలాగే ఈ నెల 23వ తేదీన చేయనున్న విద్యార్థుల పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పార్టీ ఉపాధ్యక్షుడు పతివాడ సత్యనారాయణ, పెన్షనర్స్ వింగ్ అధ్యక్షుడు డోల మన్మథకుమార్, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలు పతివాడ కృష్ణవేణి, పార్టీ నాయకులు లెంక లక్ష్మణరావు, సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాధనం దుర్వినియోగం సరికాదు



మాట్లాడుతున్న పతివాడ సత్యనారాయణ

నెల్లిమర్ల రూరల్: యోగా కార్యక్రమం పేరిట కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేయడం సరికాదని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పతివాడ సత్యనారాయణ విమర్శించారు. ఇదే విషయమై ఆయన మండలంలోని కొండగుంపాం గ్రామంలో విలేకరులతో శనివారం మాట్లాడారు. యోగా కోసం అంత డబ్బులు వెచ్చించి ఉండాల్సింది కాదని, అదే సొమ్ముతో సంక్షేమ పథకాలు అమలు చేస్తే ప్రజలకు ఉపయోగపడేదన్నారు. ఇప్పటికైనా ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేయాలని హితవుపలికారు.



ఆర్.శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: కూటమి ప్రభుత్వం తన చేతగాని పాలన నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు రకరకాల కార్యక్రమాలు చేపడుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు విమర్శించారు. ఇదే విషయమై ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో చిల్లిగవ్వ లేదని చెబుతూనే ఆడంబరాలకు పోతున్నారని ఎద్దేవా చేశారు. పబ్లిసిటీ కోసం కోట్లాది రూపాయల ప్రజాధనంతో విశాఖపట్నంలో యోగా కార్యక్రమానికి జనాన్ని తరలించారని, అదే డబ్బులతో సంక్షేమ పథకాలు అందిస్తే ప్రజలను న్యాయం జరిగేదన్నారు.

ఆరోగ్య 'యోగ'



నెల్లిమర్ల రూరల్: సెంచూరియన్ వర్సిటీలో యోగా చేస్తున్న విద్యార్థులు



విజయనగరం అర్బన్: ఎంఆర్ అటానమస్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, సిబ్బంది



డెంకాడ: జొన్నాడ ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, సిబ్బంది



విజయనగరం రూరల్: రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో యోగా సాధన

వాడవాడలా అంతర్జాతీయ యోగా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులంతా కార్యక్రమంలో పాల్గొని, యోగా విశిష్టతను తెలియజేశారు. యోగా చేయడం ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రతిఒక్కరూ తమ జీవనశైలిలో యోగాను భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. పలువురు యోగా గురువులు, విద్యార్థులు వేసిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. –విజయనగరం, నెల్లిమర్ల నెట్‌వర్క్

దరఖాస్తులాహ్వానం

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల గురుకుల పాఠశాలలో 6,7,8,9 తరగతుల్లో మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అప్పారావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకుంటే 25వ తేదీ ఉదయం 10 నుంచి 11 గంటలకు 6,7 తరగతులు, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు 8,9 తరగతుల బాలురకు సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి



కార్మికులతో కలసి వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకురాలు లక్ష్మి

దత్తిరాజేరు: జూలై 9న దేశ వ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ సంఘాలు చేపట్టనున్న ఒక్క రోజు సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకురాలు లక్ష్మి పిలుపునిచ్చారు. ఈ మేరకు కోమటిపల్లిలో ఆటో కార్మికులతో కలిసి సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధానిగా మోదీ మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత 42 కార్మిక చట్టాలను రద్దు చేయడం దారుణమన్నారు. కార్మికులకు అన్యాయం చేసి, కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ప్రజలను అన్ని రకాలుగా మోసం చేస్తున్నారని.. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దాలినాయుడు, గౌరి, అప్పలనాయుడు, గౌరీష్, రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో ముప్పు



చిట్టేయివలసలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగిస్తున్న వైద్య సిబ్బంది



పిడిశీల గ్రామంలో ఫీవర్ సర్వే చేపడుతున్న సిబ్బంది

- అప్రమత్తతే మార్గం..
- అవగాహన తప్పనిసరి అంటున్న వైద్యులు

గజపతినగరం రూరల్: వేసవికాలం వెళ్లిపోయి వర్షాకాలం సీజన్ ప్రారంభమైంది. అడపా దడపా వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించేవారు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ సీజన్‌లో ప్రధానంగా డెంగీ, చికెన్ గున్యా, టైఫాయిడ్, మలేరియా, మొదదువాపు వంటి వ్యాధులు ప్రబలుతాయి. కేవలం అప్రమత్తంగా ఉండడం వల్లే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఈక్రమంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు మరుపల్లి పీహెచ్‌సీ పరిధిలోని సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ, ఎంఎల్‌హెచ్‌పీఓలను బృందాలుగా ఏర్పాటు చేసి 30 గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఇంటి చుట్టుపక్కల మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- శరీరం పూర్తిగా కప్పి ఉండేలా సాక్సులు, బూట్లు, ఫ్యాంట్లు, షర్టులు ధరించాలి.
- దోమలు ఇళ్లల్లోకి రాకుండా కిటీకీలు, తలుపులకు సన్నటి జాలీలు ఏర్పాటు చేసుకోవాలి.
- దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలి.
- జనావాసాల మధ్యకు పందులు రాకుండా చూసుకోవాలి.
- ఎప్పటికప్పుడు కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
- ఇంటి ఆవరణలో ఖాళీ కొబ్బరి బొండాలు, వాడి పడేసిన టైర్లు ఉండకుండా చూసుకోవాలి.
- ఇంటిలో నిత్యం వినియోగించే రుబ్బురోళ్లు, తిరగళ్లు, ఫ్రిజ్‌లు, కూలర్లు, పూల కుండీలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.

అశ్రద్ధ తగదు..





వర్షాకాలం ప్రారంభం కావడంతో ప్రజలు తమ ఇళ్లతో పాటు చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు వేడి ఆహారం తీసుకోవాలి. వర్షాకాలంలో ఏమాత్రం జ్వరం వచ్చినా అశ్రద్ధ చేయకుండా ముందుగా వైద్యుడ్ని సంప్రదించాలి.

– డాక్టర్ అనూజ్‌కుమార్, డాక్టర్ పుష్పాంజలి, మరుపల్లి పీహెచ్‌సీ

'యువత పోరు'కు పిలుపు



యువత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ యువ నేతలు

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పైడపునాయుడు

గజపతినగరం రూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కూడలి వద్ద ఈ నెల 23న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం పిలుపు మేరకు చేపట్టనున్న యువతపోరును విజయవంతం చేయాలని యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పైడపునాయుడు పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో యువతపోరుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తయినా ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయిందన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ హామీలు అటకెక్కాయన్నారు. తల్లికివందనం కూడా సగానికి పైగా లబ్ధిదారులకు పడలేదని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోనే రూ.1.58 లక్షల కోట్లు అప్పులు చేసిందన్నారు. ఉద్యోగులు, పింఛనర్లకు డీఏలు, పీఆర్సీలు ఇవ్వలేదని మండిపడ్డారు. యువత పోరు కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడుతో పాటు పార్టీ మండలాల అధ్యక్షులు చిరంజీవి, బి.జగదీష్, కె.విజయ్, జి.సురేష్, రవికుమార్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, యువత పాల్గొన్నారు.